www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 08 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8


## నేడు కలెక్టరేట్ ఎదుట వ్య.కా.స ఆందోళన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ కార్మికులకు మహాలక్ష్మి , ఆత్మయ భరోసా పథకాన్ని తక్షణం అమలు చేయాలని పింఛన్లను నాలుగువేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ తెలిపారు. ఈనెల ఎనిమిదిన ఉదయం 10 గంటలకు వందలాది మంది వ్యవసాయ కార్మికులతో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టామని వారు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ. 2,500 ప్రతి నెల ఇవ్వాలని, ఆత్మీయ భరోసా ద్వారా వ్యవసాయ కార్మికుల ఖాతాల్లో ఏడాదికి రూ. 12వేలు జమ చేయాలని, గతంలో ఇస్తున్న రెండు వేల పింఛన్‌ను నాలుగువేలకు పెంపుదల చేయాలని, దివ్యాంగుల పింఛన్‌ను కూడా పెంచాలని తదితర డిమాండ్‌లతో ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కొత్త మున్సిపాలిటీలలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడంతో పాటు గత ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లుగా 57 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు. ఆందోళన కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ లు తెలిపారు.

# ఎన్నాళ్లీ యాతన..!

## ముందుకు సాగని రిజర్వేషన్ ప్రక్రియ

-జరగని స్థానిక ఎన్నికలు
-సమస్యల వలయంలో పల్లెలు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రిజర్వేషన్ చిక్కుముడి నడుమ స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. స్థానిక సంస్థల్లో వెనకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి రకరకాల కారణాలతో కాలయాపన జరుగుతుంది. ఎన్నికలు లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి వచ్చిన ఏమి చేయలేని సంకట స్థితిలో ఉన్నది. ఈ స్థితిలో 42 శాతం రిజర్వేషన్ లేకుండా పార్టీ పరమైన పార్టీపరమైన రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఎన్నికలకు వెళితే ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఒకవేళ 42 శాతం రిజర్వేషన్ అమలుకు చట్టబద్ధతతో ముందుకు వెళ్లాలంటే చట్టపరమైన అనేక చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పుడు తెలంగాణ పరిస్థితి విడవమంటే పాముకు కోపం కరవమంటే కప్పకు కోపం అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ




వర్గాలు ఏమి చెబుతున్నా ఎన్నికల జాబితాలు తుదిదశకు చేరుకున్న ఎన్నికల ప్రక్రియ కోసం మరి కొంత కాలం వేచిచూడక తప్పదన్నది వాస్తవం. 42 శాతం బిసిలకు రిజర్వేషన్ అమలుకు సంబంధించి కొంత వేచిచూసే ధోరణి అవలంభించిన ఫర్వాలేదన్న సానుకూల ధృక్పథం అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న కానీ పంచాయతీల్లో సమస్యలు మాత్రం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. గ్రామ పంచాయతీ మిగతా 2లో..

## తెలంగాణ పోరాట నిప్పు కణిక రావి నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో పోరాట అగ్గి రగిల్చిన వారిలో సుప్రసిద్ధ కమ్యూనిస్టు రావి నారాయణరెడ్డి ఒకరని ఆయన పోరాట నిప్పు కణిక అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. నిజాం నిరంకుశ నియంతృత్వ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి బానిసలుగా బతుకుతున్న ప్రజలను చైతన్యపరిచిన ఘనుడు రావి నారాయణ రెడ్డి అన్నారు. రావి నారాయణరెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం రావి నారాయణరెడ్డి

- ఆయన స్ఫూర్తితో ఎన్నో ప్రజా ఉద్యమాలు
-వర్ధంతి సభలో సిపిఐ నేత బాగం

చిత్ర పటానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణలో నాటి పరిస్థితులను చూసి తెలంగాణ విముక్తి తప్ప మరో మార్గం లేదని సాయుధ పోరాటంలో మిగతా 2లో..

## ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి కొనసాగే అర్హత లేదు


-ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటాలే మార్గం
-సిసిఏ సదస్సులో పరకాల ప్రభాకర్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓట్లు చోరీ చేసి గెలిచిన కేంద్ర ప్రభుత్వానికి, చోరీకి సహకరించిన కేంద్ర ఎన్నికల సంఘానికి కొనసాగే అర్హత లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీతోనే అధికారంలోకి వచ్చిందని ఈ విషయాన్ని జన బహుళ్యంలోకి తీసుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ పౌర సమాజం (సిసిఏ) ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో కంచె చేను మేసినట్లు ఎన్నికల సంఘం ఓట్లను తొలగించిన నేపథ్యంలో ప్రక్షాళన ప్రారంభం ఎన్నికల సంఘం ఎవరి పక్షం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ బిజెపి 2024 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజ్యాంగ సవరణ మిగతా 2లో..

# ఎన్నాళ్లీ యాతన..!

(మొదటిపేజీ తరువాయి)




పాలక వర్గాల పదవి కాలం ముగిసి 20 మాసాలు కావస్తున్నా ఎన్నికలు జరుగకపోవడంతో స్థానిక సంస్థలకు నిధులు లేవు. నిధులు తప్ప నిధులు లేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిస్సయ స్థితిలో ఉన్నారు. బ్లీచింగ్ పౌడర్ అందించే వారు ఉన్న దానిని చల్లేందుకు కూలీలు దొరకడం లేదు. ప్రతి పని ఆర్థికపరమైంది కావడంతో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులుకానీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కానీ అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో పల్లెలు సమస్యల పుట్టలుగా మారాయి. పారిశుధ్యం, త్రాగు నీటి సరఫరా సహా ఏ సమస్యను పరిష్కరించలేని దయనీయ స్థితి. నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు రావడం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ల రుణాలు గ్రామ పంచాయతీల మెడకు చుట్టుకున్నాయి. రేపో మాపో బ్యాంకర్లు ట్రాక్టర్లను జప్తు చేసే పరిస్థితి. వీటన్నింటి నడుమ ఏమి చేయాలో పాలుపోక అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో స్థానికులు ముందుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు. వీధి దీపాలు కూడా కొన్ని గ్రామాల్లో కొందరు వ్యక్తులు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయం. గ్రామ పంచాయతీ ఎన్నికలకు నిధుల రాకకు ముడిపడి ఉన్నందున ఎన్నికలు జరపాలి. ఎన్నికలు జరపాలంటే రిజర్వేషన్ తేలాలి. ఈ రెండింటి నడుమ స్థానిక ఎన్నికలు మరికొంత కాలం ఆలస్యం కావడం అదే సమయంలో గ్రామ పంచాయతీల ఆర్థిక ఇబ్బందులు కూడా మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గ్రాంటును విడుదల చేసి పారిశుధ్యం, విద్యుత్, త్రాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉన్నది. ఆ దిశగా ఆలోచన చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇదే సమయంలో గ్రామ పంచాయతీలు తీసుకున్న రుణాలకు సంబంధించి మరికొంత కాలం వాయిదా వేయాల్సిన అవసరం ఉంది.

**అప్పుల ఊబిలో పంచాయతీ కార్యదర్శులు...**

గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గతంలో పంచాయతీలకు నిధులు వస్తాయన్న ఆలోచనతో పంచాయతీ కార్యదర్శులు పనుల నిర్వహణకు అప్పులు తెచ్చారు. కొందరు కార్యదర్శులు రూ. 50వేల నుండి రెండు లక్షల వరకు పంచాయతీ పనుల నిర్వహణకు అప్పులు తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయడంతో ఆ అప్పులు అలాగే మిగిలిపోయాయి. ఇంత వరకు గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న కార్యదర్శులు సైతం అప్పులు తెచ్చి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకృతి విపత్తుల నిధుల నుంచి గ్రామ పంచాయతీలకు రెండు లక్షల చొప్పున నిధులను కేటాయించింది. ఆ నిధులతో బ్లీచింగ్, సున్నం చల్లే పనులను పూర్తి చేశారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీల నుండి నిధులను సమకూర్చే వారు. ఇప్పుడు ప్రభుత్వమే మూడు నెలలకు ఒకసారి మల్టీ పర్పస్ వర్కర్లకు వేతనాలు ఇస్తుంది. గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉన్న ట్రాక్టర్లకు సంబంధించి డీజిల్ సరఫరా చేసిన పెట్రోల్ బంక్ యజమానులు, మెకానిక్ షెడ్ల యజమానులు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రెండేళ్లుగా బకాయిలు పేరుకుపోయాయి. ఇదిలా ఉండగా గతంలో ఇంటి పన్నులను వసూలు చేసి పంచాయతీ కార్యదర్శులు ట్రెజరీల్లో జమ చేసేవారు. ఆ నిధులను పంచాయతీ అవసరాల దృష్ట్యా చెక్కుల రూపంలో డ్రా చేసుకునే వారు. రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు నిధులను డ్రా చేసే పరిస్థితి కనిపించడం లేదు. మొత్తంగా గ్రామ పంచాయతీలు సమస్యల వలయంలో కూరుకుపోయాయి. ఇదిలా ఉండగా గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లుగా ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మూడుసార్లు ఓటర్ల జాబితాలను జిరాక్స్‌లు తీశారు. జిరాక్స్ సెంటర్ల వద్ద ఈ బాకీలు పేరుకుపోవడం గమనార్హం.

# తెలంగాణ పోరాట నిప్పు కణిక రావి నారాయణరెడ్డి




(మొదటిపేజీ తరువాయి)

రావి నారాయణరెడ్డి ముందు వరుసలో నిలిచారన్నారు. పల్లె పల్లెలో రైతాంగ పోరాటాన్ని రగిల్చిన మహనీయుల్లో రావి నారాయణ రెడ్డి ఒకరన్నారు. భూమి విలువను తెలిపి అది దున్నే వాడి చేతిలో ఉంటేనే ఈ సమాజానికి శ్రేయస్సు అని ఆయన తెలిపారు. రాజకీయాలకు అతీతంగా యావత్ తెలంగాణ ప్రజలు మహోన్నతుడిగా గౌరవించే రావి నారాయణరెడ్డి తన జీవిత కాలం కమ్యూనిస్టుగా జీవించారన్నారు. భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో తొలిసారి జరిగిన ఎన్నికల్లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీతో గెలిచి దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల సత్తాను చాటారన్నారు. సాయుధ పోరాటంలో ఆసువులు బాసిన వారికి అండగా నిలబడడంలోనూ పోరాటంలో పాల్గొన్న వారికి పింఛన్లు ఇప్పించడంలోనూ రావి నారాయణ రెడ్డి కృషి దాగి ఉందన్నారు. చరిత్రను సృష్టించిన ఒక మహనీయుని అడుగు జాడల్లో నడిచేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపు నిచ్చారు. పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడిందని వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్రను మననం చేసుకుంటూ భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దోజు శ్రావణ్, బోడా వీరన్న, జాకీర్, సురేందర్, శ్రీనాథ్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి కొనసాగే అర్హత లేదు

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనల్, జమ్ము అండ్ కశ్మీర్ తదితర అంశాలతో ఎన్నికలకు వెళ్లాలని భావించిందని తొలి దశలోనే ప్రజల్లో వ్యతిరేకత కనపడడంతో ఓట్ల చోరీపై దృష్టి సారించిందని ప్రభాకర్ తెలిపారు. 2024 ఎన్నికలు అవకతవకలతో కూడిన ఎన్నికలని ఇంత చేస్తేనే అధికారంలోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ కారణంగా పార్లమెంట్ పవిత్రతను కోల్పోయిందని పవిత్రత కోల్పోయిన పార్లమెంటుకు కొనసాగే అర్హత లేదన్నారు. జనాభిప్రాయంతో ప్రస్తుత పార్లమెంటు ఏర్పాటు కాలేదని ప్రస్తుత ఎన్నికల సంఘం చోరీ కారణంగానే అధికారంలో కొనసాగుతుందన్నారు. ప్రజాస్వామ్యం ఊపిరిపోసుకోవాలంటే ప్రస్తుత కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుత బిజెపి ప్రభుత్వ పాలనపై ప్రజలు బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఒక రోజో రెండు రోజులకో పరిమితమై ఆందోళనలు చేస్తే మార్పురాదన్నారు. సుదీర్ఘ ఉద్యమాలు జరగాలని ప్రజాస్వామ్య పరిరక్షణకు ఖమ్మం నాంది పలకాలని ఆయన పిలుపునిచ్చారు. మణిపూర్ ఆందోళనల మాదిరి ఒకట్రెండు ఆందోళనలకు పరిమితమైతే దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు కోసం సుదీర్ఘ కాలం బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా జాతీయత పరంగా నష్టం చేస్తున్న బిజెపిని సాగనంపడంతోనే భారతదేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని పరకాల ప్రభాకర్ తేల్చి చెప్పారు. ఈ సదస్సుకు డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ అధ్యక్షత వహించగా, రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంఘాల ప్రముఖులు, ప్రత్యామ్నాయ పౌర సమాజం బాధ్యులు హాజరయ్యారు.

# నేడు పాలేరు డివిజన్‌కు 240 మెట్రిక్ టన్నుల యూరియా రాక

### 37 కేంద్రాల ద్వారా రైతులకు అందించేందుకు చర్యలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేడు పాలేరు డివిజన్ కు 240 మెట్రిక్ టన్నుల యూరియా రానుంది అని, 37 కేంద్రాల ద్వారా రైతుల కు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.సతీష్ అన్నారు. మండలం లోని నాచేపల్లి, నేలకొండపల్లి, రాజేశ్వరపురం, రాజారాంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పంపిణీ చేస్తున్న యూరియా ను ఆదివారం పరిశీలించారు. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు...పాలేరు డివిజన్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ప్రత్యేకకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పాలేరు డివిజన్ 17 సొసైటీలు ఉండగా...రైతులకు యూరియా ను సకాలంలో అందించాలనే ఉద్దేశ్యంతో కొత్తగా 34 ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండేందుకు కేంద్రాలకు కేటాయించిన గ్రామపంచాయతీల రైతులు ఆ కేంద్రం కు వెళ్లి యూరియా ను తీసుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం 100 టన్నుల యూరియా ను 19 కేంద్రాల ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. సోమవారం మరో 240 మెట్రిక్ టన్నుల యూరియా ను 37కేంద్రాలలో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత ఏడాది 25,176 టన్నులు కాగా... ఈ సీజన్ లో ఇప్పటి వరకు 25,261 అందించినట్లు తెలిపారు. గత సీజన్ కంటే ఈ సీజన్ ఇప్పటి వరకు దాదాపు 85 మెట్రిక్ టన్నుల యూరియా ను అధికంగా అందించినట్లు తెలిపారు. రైతులు నానో యూరియా దాదాపు 80 శాతం వినియోగం ఉంటుందని... యూరియా మాత్రమ కేవలం 30 శాతం మాత్రమే వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. కావునా రైతులు నానో యూరియా ను పిచికారి చేసే విధానం ను అలవర్చుకోవాలని సూచించారు. యూరియా పంపిణీ కి సహకరిస్తున్న అధికారులు, రైతులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో అవినాష్, సొసైటీ సీఈవో ఖమ్మం వెంకటేశ్వర్లు, కనపర్తి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తికి మద్దతు ధర ఇవ్వాలి : దొండపాటి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులు పండించిన పంటకు జాతీయ రైతుల కమీషన్ ఎంఎస్ స్వామినాధన్ కమీషన్ సిఫార్స్ చేసిన సమగ్ర సి ప్లస్ 2 ప్లస్ 50 ఖర్చుల సూత్రాన్ని ఉపయోగించి క్వింటాకు 10,075 రూపాయలు మద్దతుధర కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తనికెళ్ల సిపిఐ కార్యాలయంలో గుమ్మిడెల్లి సైదారావు అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశం లో ఆయన ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి దిగుమతుల సుంకాన్ని తొలగించడం వలన భారత దేశం అంతటా 60 లక్షల పత్తి రైతు కుటుంబాల జీవనోపాధి మరింత దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నరేంద్ర మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తు వ్యవసాయరంగాన్ని దెబ్బతీసేందుకు రైతులపై కక్షసాధింపు చర్యలను కొనసాగిస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతను బిజెపి ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు. అకాల వర్షాలకు తుఫానులకు నష్టమైన పంటలకు నష్టపరిహారం అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆయన ఆరోపించారు. వరిధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ ఇంతవరకు ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు పెసర పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. పంటల భీమా పథకం లేకపోవడం వల్ల రైతులు తమ పంటలు కోల్పోయి ఆర్థికంగాఅప్పుల పాలవుతునానరని అన్నారు. తక్షణమే పంటల భీమా పథకాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చశారు. రైతులు ఐక్యం తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్‌కెఎం ఆధ్వర్యంలో ఈనెల 10 న ఖమ్మంలో జరిగే సదస్సు ద్వారా బిజెపి నరేంద్ర మోడి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ సదస్సులో పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. ఈ సమవేశంలో రైతుసంఘం జిల్లా నాయకులు రత్తమయ్య, బూసా నాగరాజు, యాసా వెంకటేశ్వర్లు, రాములు, మల్లిఖార్జున్ తదితరులుపాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం వారి నివాసంలో కులుసుకుని పరామర్శించారు. గత వారం నుంచి వైరల్ ఫీవర్‌తో చల్లగుళ్ళ నరసింహారావు బాదపడుతున్న విషయం తెలుసుకున్న తుమ్మల హుటాహుటిన ఆయన నివాసానికి చేరుకుని చల్లగుళ్లని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల కాశీలో స్వర్గస్తులైన చీకటి కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వేంసూరు మండలం దూళ్ల కొత్తూరు గ్రామంలో పర్వతనేని అంజిబాబు అత్త కలపాల సీతమ్మ దశ దిన ఖర్మ కార్యక్రమంలో పాల్గొని, వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తుమ్మల వెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్



బాబు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, విద్యా సంస్థల అధినేత చలసాని సాంబశివరావు, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇమ్మనేని ప్రసాద్ రావు, జగన్మోహన్ రావు, దేవగిరి అక్కిరెడ్డి,వెంకటరెడ్డి, ఆంగోతు రామారావు తదితరులున్నారు.

# నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

### -కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఓటరు జాబితాపై నేడు (సోమవారం) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జెడ్పిటిసిల వారీగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితా తయారు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. దీనిపై జిల్లా స్థాయిలో వివిధ గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

# రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### -సిపిఐ, ఏఐకెఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**ప్రజాపక్షం/ తల్లాడ :** రైతుల సమస్యలను వెంటనే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం తల్లాడ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రధానమంత్రి మోడీకి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఏఐకెఎస్ జిల్లా నాయకులు నల్లమోతు నరసరావు లు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారన్నారు. ఇటీవల వచ్చిన వర్షాలకు వరి, పత్తి,పెసర, మొక్కజొన్న వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని నష్టపరిహారం అందించాలన్నారు.



సకాలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులను అందించాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంతకాల సేకరణ ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, జిల్లా నాయకులు లక్ష్మి నారాయణ, రామకృష్ణ, మల్లేష్, శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీలు ఎస్టిలు కాదనడం సరైంది కాదు

### -లంబాడీ జేఏసి ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లంబాడీలు ఎస్టిలు కారు అని చెప్పడం సరైంది కాదని టిఎస్‌టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ఈరునాయక్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల మీద జరుగుతున్న అసత్యప్రచారాలు, ప్రజాప్రతినిధులు సుప్రీం కోర్టులో లంబాడీలను ఎస్టి జాబితా నుంచి తీసివేయాలని కేసులు వేయడాన్ని నిరసిస్తూ లంబాడీ జేఏసి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఈరునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు వర్గాల మధ్య జరుగుతున్న విభేధాన్ని పరిష్కరించాలన్నారు. లంబాడీలు రాజ్యాంగ బద్ధంగానే ఎస్టిలుగా చెలామణి అవుతున్నారని ఎస్టిలు కాదని కించపర్చడం సరైంది కాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బానోత్ కిషన్‌నాయక్, భూక్యా భిక్షపతిరాథోడ్, డా౹౹ రాజ్‌కుమార్ యాదవ్, రవిరాథోడ్, మంగ్యానాయక్, రామ్మూర్తినాయక్, తారాదేవి, సోమ్లా నాయక్, వెంకట్రావు, హరి, హీరాలాల్, శోభన్ నాయక్, లక్ష్మన్ నాయక్, భాస్కయ్య నాయక్, భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# అంకితభావంతో పనిచేస్తే సరైన గుర్తింపు

**ప్రజాపక్షం/ మధిర :** ఏ వృత్తిలోనైనా అంకితభావంతో పనిచేస్తున్న తగిన గుర్తింపు వస్తుందని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్(ఎఫ్ఆర్‌సి) గౌరవాధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. ఆదివారం మధిర ఇండోర్ స్టేడియంలో ఎఫ్ఆర్‌సి ఆధ్వర్యంలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా ఎంపికైన వై.ప్రభాకర్, సుగ్గుల రామకృష్ణారావులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధిర మండల విద్యారంగానికి విశేష సేవలు అందించిన ఎంఇఓ వై.ప్రభాకర్, పాఠశాలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఎస్.రామకృష్ణారావుల సేవలను కొనియాడారు. నిరంతర శ్రమ, అంకితభావం ఉన్నట్లయితే ఎతంటి కఠన లక్ష్యం అయిన సులువుగా చేరుకోవచ్చునని తెలిపారు. ఇరువురికి ఒకేసారి జిల్లాస్థాయి అవార్డులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం నిర్వాహకులు వై.చిన్ని, ఎఫ్ఆర్‌సి సభ్యులు ఉపాధ్యాయులు వీరయ్య, ఎమ్మెస్సార్, వినయ్, రాకేష్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మ ణ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు మంత్రి తుమ్మల పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు ఖమ్మంలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామంలో మూడు కోట్ల వ్యయంతో నిర్మించనున్న బిసి వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణ పనులకు, రూ. 30 లక్షలతో నిర్మించనున్న పశువుల ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం జరిగే సభలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని తొమ్మిదవ డివిజన్ రోటరీనగర్‌లో సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటన సందర్భంగా వివిపాలెంలో ఏర్పాట్లను ఆదివారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ, కిలారు వెంకటరమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్ రంగం ఖమ్మం రిలయన్స్ నిస్సాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగాలు కల్పించుటకు సెప్టెంబర్ తొమ్మిదిన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ తొమ్మిది మంగళవారం ఉదయం 10 గంటలకు గాంధీచౌక్‌లోని కోటాక్ మహీంద్ర బ్యాంక్ పైన గల రిలయన్స్ నిస్సాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఖమ్మం నందు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖమ్మంజిల్లాలో పనిచేసేవిధంగా రిలయన్స్ నిస్సాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ. 20వేల నుండి రూ. 50వేల వరకు ఉంటుందన్నారు. మొత్తం 25 ఉద్యోగాల భర్తీకిగాను జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

# త్రివేణిలో గ్రాండ్ పేరెంట్స్ డే




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రైమరీ విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌ను పాఠశాలకు ఆహ్వానించి వారి యొక్క విశిష్టతను, ఉమ్మడి కుటుంబం యొక్క గొప్పతనాన్ని పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్‌ను సన్మానించారు. అనంతరం త్రివేణి సంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య లతో పిల్లలకు ఉండే అనుబంధం చెప్పలేనిదన్నారు. మనవళ్లు, మనవరాళ్లను గ్రాండ్ పేరెంట్స్ చూసుకునే విధానం ఎంతో ముచ్చటగొలుపుతుందన్నారు. చిన్నారులతో గ్రాండ్ పేరెంట్స్ సరదాగా ఆటలు ఆడుతూ కబుర్లు చెబుతూ వారితో ఆనందంగా గడుపుతారన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ చిన్నారుల మధ్య ఎమోషనల్ బంధం ఉంటుందన్నారు. చిన్నారులకు కొత్త కొత్త విషయాలను, వారి అనుభవాలను తెలియజేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని వెంకటేశ్వర టాకీస్ రోడ్డులో నివాసముంటున్న బెజవాడ గాంధీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ఆదివారం వారి నివాసానికి చేరుకొని గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా బైపాస్ రోడ్‌లో ఇటీవల మరణించిన అల్తాఫ్ కుటుంబ సభ్యులను కలుసుకుని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మాజీ కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు కమల్ పాషా, సుదీర్, సుజాత, హారిక, సత్తుపల్లి పట్టణ, మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీ




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని విజ్ఞాన్ పాఠశాలలో ఆదివారం జరిగిన విశ్రాంతి ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వేల్పుల కృష్ణయ్య, కార్యదర్శిగా ఫ్రాన్సిస్, కోశాధికారిగా సముద్రాలు పుల్లారావు లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ అధ్యక్షులు కృష్ణయ్య, కార్యదర్శి సుబ్బారావు, ఎన్నికల అధికారిగా కేశవరెడ్డి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన డిఏలు, ఆరోగ్య భీమా, బకాయిలు తదితర సౌకర్యాలు అన్నిటిని కూడా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

### -ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపండి : ఎంపీడీవో



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నేడు బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శుల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి అన్నారు. నేటి ఉదయం 11గంటలకి సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని 17 ఎంపీటీసీలు, ఒక జెడ్పిటిసికి సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, ఓటర్ లిస్టును కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయాలకు నోటీస్ బోర్డుపై అతికించడం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా లిస్ట్‌పై అభ్యంతరాలు ఉన్న వారు 8వ తేదీన సాయంత్రం 4గంటల లోపు లిఖిత పూర్వకంగా తెలుపవచ్చని కోరారు. రాజకీయ పార్టీల నాయకులే కాకుండా మండలంలో ఉన్న ఏ ఓటర్ అయినా ఇచ్చినటువంటి అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో ఏర్పాటు చేయబడ్డ సమావేశాన్ని నాయకులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## ఓటర్ల జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎంపిటిసి, జెడ్పిటిసి 2025 ఎన్నికలకు సంబంధించి 6వ తేదీన సింగరేణి మండలంలోని 16 ఎంపిటిసి స్థానాల హెడ్ కోటర్ గ్రామ పంచాయితీ నోటీసు బోర్డు, మండల ప్రజాపరిషత్ కార్యాదలయం సింగరేణి నోటీసు బోర్డు నందు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించడం జరిగిందని ఎంపీడీవో పి శ్రీనివాసరావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై సోమవారం మధ్యాహ్నం 12గంటలకు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి ఫైనల్ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ఈనెల 10వ తేదీన ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులుగా 10 మందిని ఎన్నిక కావడం ఎంతో సంతోషమని కూసుమంచి మండల ఎంఈవో రామాచారి తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఖమ్మం కలెక్టర్ ఆఫీసులో కూసుమంచి మండల నుండి ఎన్నికైన పది మందికి డీఈవో శ్రీజ, ఎంఎల్‌సి శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డుని ప్రధానం చేశారు. కూసుమంచి మండలం నుండి ఎన్నిక కాబడిన ఉత్తమ ఉపాధ్యాయులు టి భాస్కర్, వీరస్వామి, రవీందర్‌రెడ్డి, యాదగిరి, స్వరూప రాణి, అమృత్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపేంద్ర, లక్ష్మీ నారాయణ, విజయలక్ష్మి ఈసందర్భంగా టిపిటిఎఫ్ మండల బాధ్యులు బద్రు, యాకయ్య, ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పినపాకలో రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజకవర్గంలో రూ.125 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్లు, లింకు రోడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, కాలువలు వంటి మౌలిక సదుపాయాల పనులు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తామని ఆయన అన్నారు. అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు.

## ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

### నేడు ఎంపిపి కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి 10 ఎంపిటిసి, ఒక జెడ్పిటిసి స్థానానికి సంభంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 8వ, తేదీలోపు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఎంపిడిఓ కుడుముల విజయ భాస్కర్‌రెడ్డి కోరారు.దీనికి సంభందించిన ఓటర్ల ముసాయిదా జాబితాను కార్యాలయం బోర్డుపై ఉంచామని ఆదివారం తెలిపారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన మండల స్థాయి అధ్యక్ష, కార్యదర్శులతో ఈ నెల 11వ, తేదీన ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశామని కావునా సకాలంలో హాజరు కావాలన్నారు. పోలింగ్ కేంద్రాల, ఓటర్ల తుది జాబితాను 10వ, తేదీన ప్రచురింపబడునని అన్నారు.

# వైరాలో మూగబోయిన డిజె సౌండ్స్

**-వినాయక నిమజ్జనంలో కనిపించని డిజె సౌండ్స్**
**-పోలీసులను అభినందిస్తున్న ప్రజలు**
**-ప్రజల ఆరోగ్యమే ముఖ్యం : ఎస్సై రామారావు**






**ప్రజాపక్షం/వైరా:** ప్రతి సంవత్సరం వైరాలో వినాయక నిమజ్జనం శోభాయాత్రలో డిజె సౌండ్లతో హోరెత్తించింది. అలాంటి డిజె సౌండ్లు కనిపించలేదు. వైరాలో జరిగిన వినాయక నిమజ్జనం శోభయాత్రలో డిజె సౌండ్స్ మూగబోయావని చెప్పవచ్చును. ప్రజల ఆరోగ్యం రీత్యా పోలీసులు డిజె సౌండ్లను పెట్టవద్దని పెడితే సహించేది లేదని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో పాటు ప్రజల ఆరోగ్యాలు కూడా మనందరి బాధ్యత అనేది చెప్పిన ప్రతి మాట వినాయక విగ్రహ ఏర్పాటు కమిటీలు కూడా పాటించాయి. వైరా ఎస్సై పి.రామారావు పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు తన సిబ్బందితో ప్రతి వినాయక విగ్రహం వద్దకు వెళ్లి వారితో మాట్లాడి డిజెలు పెట్టవద్దని చెప్పడంతో పాటు వారిలో చైతన్యం తేవడంలో సక్సెస్ అయ్యారని చెప్పవచ్చును. వైరా పోలీస్‌స్టేషన్‌లో సిఐ సాగర్, ఎస్సై రామారావు డిజెలో నిర్వాహకులతో కూడా సమావేశం ఏర్పాటు చేసి డిజెలు పెడితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎందుకు అంటే డిజె సౌండ్ గుండెకు దడదడ అనే శబ్దంతో వైబ్రేషన్ వస్తూ ఉంటాయి. ఎంతోమంది హార్ట్ పేషెంట్లు వృద్ధులు, చిన్నారులు ఈ శబద్దాలకు ఇబ్బందులు పడ్డ పరిస్థితులు ఎన్నో చూశాం. అలాంటి పరిస్థితులు ఈసారి వైరాలో కనిపించలేదు అంటే పోలీసుల పాత్ర గొప్పదని చెప్పవచ్చును. డిజె సౌండ్‌లు వైరాలో కనిపించకపోవడం పట్ల పోలీసులు పనితీరుపై ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యం ముఖ్యం : ఎస్సై రామారావు**



డిజె సౌండ్‌తో ప్రజలు ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడతారని, అలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లా సిపి ఆదేశాల మేరకు ఏసిపి రెహమాన్ సూచనలతో సిఐ సాగర్ ఆదేశాలతో వైరాలో వినాయక శోభ యాత్రలో డిజిల్ నిషేధించడం జరిగిందని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ ప్రజలు కూడా ఎంతో సహకరించారని, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా డప్పు మేళాలతో సాంప్రదాయ బద్ధంగా గణపతిని గంగ ఒడికి పంపారని అన్నారు. డిజెలో సౌండ్ మూలనలో ప్రజలు కూడా భాగస్వాములు అయితే ఆరోగ్యానికి ఇబ్బంది ఉండదని రామారావు తెలిపారు.

## బిఇడి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి : ఐటిడిఎ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన బిఇడి కాలేజీలో ఉపాధ్యా విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులకు సమయాను కూలంగా సరైన పౌష్టికాహారాన్ని అందించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఆదేశించారు. ఆదివారం ఆయన బిఇడి కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తయారు చేస్తున్న వంటకాలను, చికెన్, కూరగాయలతో వండిన ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందితుందీ లేనిదీ, కళాశాల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ వర్షా కాలం కొనసాగుతున్నందున ఆహారాలు వేడిగా ఉన్నప్పుడు మాత్రమే వడ్డించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆదివారం తప్పని సరిగా చికెన్ అందించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ లేటుగా అందించడంతో కాంట్రాక్టర్‌ను మందలించారు. అన్ని విద్యాలయాల్లో నాణ్యతతో ఉండే చికెన్ సరఫరా చేయాలని, ఏటిడిఏఓలో మానిటరింగ్ చేయాలని, వంట సిబ్బంది వంట సమయంలో అశ్రద్ధగా ఉండరాదని, అలాంటి వారిని తొలగించి కొత్తవారిని పెట్టాలని సూచించారు. తరగతి గదులు, డైనింగ్,డార్మెటరీ, మరుగుదొడ్లు కురుస్తున్నాయని విద్యార్థులు పీఓ దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంత తొందరగా మరమ్మత్తులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని, అందుకోసం సౌకర్యాలు కూడా కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓ అశోక్ కుమార్, టిఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో వన్యప్రాణి సంరక్షణపై ఉన్నతాధికారుల పర్యటన



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరులో వన్యప్రాణి సంరక్షణ, అటవీ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పిసిసిఎఫ్) సువర్ణ, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (సిసిఎఫ్) డా.బీమా నాయక్, జిల్లా అటవీ అధికారి ఓ. కృష్ణగౌడ్ సహా మణుగూరు ఎఫ్‌డివో మక్సూద్ సహా అధికారులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మణుగూరు వద్ద ఉన్న రథం గుట్ట అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు, పగిడేరు వేదిక వద్ద వేడి నీటి బోర్, సెకండ్ ఫారెస్ట్ బ్లాక్‌లో చేసిన ప్లాంటేషన్స్ ను అధికారులు పరిశీలించారు. తరువాత మణుగూరు సింగరేణి గెస్ట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సింగరేణి మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వన్యప్రాణి సంరక్షణ, సింగరేణి ప్రాంతంలో జరుగుతున్న అటవీ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. తరువాత మనబోతులపాడు అధికారులు ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బిఓ రెసిడెన్షియల్ క్యాంపస్ ను సందర్శించి పరిశీలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పి. ఉపేంద్ర, డివై .ఆర్ఓలు, ఎఫ్ఎస్ఓ పి.నాగరాజు, ధరావత్ ప్రసాద్ ఎఫ్‌బిఓ, మణుగూరు డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ సంఘాల నాయకుల సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లి కేంద్రంగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహ ఏర్పాటుకు ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో వివిధ సంఘాల నాయకులతో సన్నాహక సమావేశాన్ని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు వారి అభిప్రాయాలను తెలిపారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమ ఏర్పాట్లుకు అన్ని విధాలుగా సహకరిస్తున్న గౌరవ శాసనసభ్యులు డా మట్టా రాగమయి దయానంద్ కి ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమం లో విశ్వబ్రాహ్మణ సంఘం నుంచి డి. ఎన్ చారి, తూముల నాగాచారి, బీసీ సంఘం నుంచి దుస్సా వెంకటేశ్వర్లు, తేళ్ళ రమేష్,మల్లెలి శ్రీనివాస్, ప్రసాద్, సృజన సాహితీ సమైక్య బాధ్యలు రామకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మధుసూదన్ రాజు, జాగృతి సాగర్, సిపిఐ(ఎం.ఎల్) శరత్, రజక సంఘం సత్తుపల్లి పట్టణఅధ్యక్షులు విరివాడ నాగభూషణం, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు గద్దె వెంకటరామయ్య, సింగరేణి ఏఐటీయూసీ నాయకులు ఉపేంద్ర చారి, కాగితపు వెంకటేశ్వరరావుతో లక్ష్మ చారి, మోహన చారి, అనంతోజు కోటేశ్వరరావు తో పాటుగా వివిధ సంఘలా నాయకులు పాల్గొన్నారు.

# 10న జరిగే ఎస్‌కెఎం సదస్సును జయప్రదం చేయండి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 10వ తేదీన ఉదయం 10గంటలకు ఖమ్మం నగరంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 31వ డివిజన్‌లో రైతుసంఘం(ఏఐకేఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే క్వింటాకు రూ.1వెయ్యి75 మద్దతు ధర చెల్లించాలన్నారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పెసర, పత్తి పంటకి తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ సమస్యను పరిష్కారం దిశగా ప్రభుత్వాలు దృష్టిసారించాలన్నారు. అనంతరం సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు మామిడి సుదర్శన్ రెడ్డి, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల నాయకులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, దొంతగాని వెంకన్న, ఘనపారపు నాగయ్య, పొన్నెకంటి రామకృష్ణ, ఏర్పుల లింగయ్య, బొడ్డు ఉపేందర్, ఘనపారపు వీరన్న, మామిడాల కిరణ్, చల్లా రాములు, ఏర్పుల రాములు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్పొరేటీకరణకు మోడీ సర్కార్ కుట్ర

**-10న జరిగే రైతు సదస్సును జయప్రదం చేయండి**
**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి గోవిందరావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ కార్పొరేటీకరణకు మోడీ సర్కార్ కుట్ర చేస్తుందని దేశీయ సంస్థలు మాదిరి వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు అప్పగించి రైతులను కూలీలుగా మార్చే యత్నంలో ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ఆరోపించారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు అంతర్జాతీయంగా అమెరికా ఆంక్షలకు మోడీ తలొగ్గారని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం జరిగింది. సమావేశంలో కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ ఇప్పటికే కార్పొరేట్ శక్తులకు తలొగ్గి వ్యవసాయ రంగ సబ్సిడీలను రద్దు చేసిన మోడీ సర్కార్ ఇప్పుడు పత్తి దిగుమతిపై సుంకాన్ని రద్దు చేయడం భారతదేశ వ్యాప్తంగా పత్తి రైతులను ఆర్థికంగా దెబ్బతీయడమేనని ఆయన తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11 శాతం పన్ను విధించే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆ పన్నును పూర్తిగా రద్దు చేసిందని దీని వల్ల దేశ వ్యాప్తంగా రైతులు పండిస్తున్న పత్తి కంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పత్తి రేటు తక్కువగా ఉండి స్థానికంగా ఉత్పత్తి అయ్యే పత్తికి ధర తక్కువగా ఉంటుందని దీని వల్ల పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్న పత్తిపై రద్దు చేసిన పన్ను ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని యధావిధిగా 11 శాతం పన్నును విధించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన మద్దతు ధర కోసం సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తుందని ఆ క్రమంలోనే ఖమ్మంలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాగం హేమంతరావు, పర్స పద్మ, ఇతర రైతు సంఘాల బాధ్యులు హాజరవుతున్నారని గోవిందరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, ఏపూరి రవీంద్రబాబు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పావులూరి మల్లికార్జున్, వెంకటనర్సయ్య, పుచ్చకాయల సుధాకర్, మార్గం శ్రీనివాస్, దొబ్బల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌కెఎం సదస్సును జయప్రదం చేయండి

**ఏఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి**



**ప్రజాపక్షం/చింతకాని :** సంయుక్త కిసాన్‌మోర్చ (ఎస్‌కెఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న జరిగే రైతు అవగాహన సదస్సును జయప్రదం చేయాలని ఏఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు.ఆదివారం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో కొండపర్తి మాట్లాడుతూ పత్తి దిగుమతి సుంకం 11శాతం కొనసాగించాలని, పత్తికి మద్దతు ధర రూ.10,075/ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే అవగాహన సదస్సులో రైతులు అధిక సంఖ్యలోమ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు, సిపిఐ మండల కార్యాదర్శి దూసరి గోపాలరావు,ఏఐకెఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, రైతులు ఏపూరి నర్సయ్య, కొల్లి చిన్న వెంకటి, గోపాల్, కిట్టయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది



**ప్రజాపక్షం/పాల్వంచ :** అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. పాత సిపిఐ కార్యాలయం సమీపంలో (చింతచెట్టు గణేష్) బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ ఆల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన వినాయక చవితి ఉత్సవాలు 20 సంవత్సరాలు పూర్తి చేసుకొని 21వ, సంవత్సరంలోకి అడుగుపెట్టాయి. ఈ సంధర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు ముత్యాల విశ్వనాథం ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కతాటిపై నిలబడి 21 సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీకి అభినందనలు తెలిపారు. సమాజంలో ప్రతీ ఒక్కరు తోటి మనుషుల పట్ల భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఒకరికి ఒకరు తోడుగా ఉండి ఆపద సమయంలో ఆదుకోవాలన్నారు. పండగలు, ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల, పట్టణ కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అడుసుమిల్లి సాయిబాబ, యూనియన్ జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లిఖార్జున్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుండాల నాగరాజు, ఏఐటియుసి నాయకులు ఇట్టి వెంకటరావు, వైఎస్ గిరి, కొమ్మవరపు దాము, బిల్డింగ్ కన్సస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ అద్యక్ష, కార్యదర్శులు ధరావత్ గోపి, కోరె క్రిష్ణ, పెనుమూడి పున్నయ్య, నంది కోటయ్య, నల్లి సురేష్, ఆర్‌కే రామక్రిష్ణ, కాసర్ల రామారావు, గురుజోష్ రమేష్ పాల్గొన్నారు.

## మోడీ సర్కార్‌పై సమరం : దొండపాటి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వ్యవసాయ పంటలకు యూరియా సంపూర్ణంగా రైతులకు అందించే వరకు కేంద్రంలో ఉన్న బిజేపి నరేంద్రమోడి సర్కార్‌పై రైతులు సమరశీలపోరాటలకు సమాయత్తం కావాలని ఖమ్మం జిల్లా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ జిల్లా సిపిఐ కౌన్సిల్ సబ్యులు మునిగె కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం అమ్మపాలెం గ్రామంలో జరిగిన రైతుసంఘం సమావేశంలో వారు ప్రసంగించారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసి కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించి రైతులను కూలీలుగా మార్చే ప్రయత్నంలో వ్యవసాయ సంస్కరణ చట్టాలను నరేంద్రమోడి ప్రభుత్వం తీసుకొచ్చిందని వారు ఆరోపించారు. ఈ చట్టాలు పూర్తిస్థాయిలో అమలు జరిగితే రైతాంగం తీవ్రమైన ఇబ్బందులకు గురవుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని తెలిపారు ఈనెల 10 న ఖమ్మంలో జరిగే రైతుసదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు దేరంగుల లక్ష్మయ్య, సీనియర్ నాయకులు వెంపటి పరుశురాములు, నరసింహారావు, కోసూరి నాగేశ్వరరావు, వెంపటి శ్రీనివాసరావు, లక్ష్మి , నరసయ్య, అలియాల లాలు, భూక్యా రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సదస్సును జయప్రదం చేయండి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం



**ప్రజాపక్షం/వైరా:** బిజెపి నరేంద్రమోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు ప్రతిఘటించేందుకు ఈ నెల10న ఖమ్మంలో ఎస్‌కెఎం ఆధ్వర్యంలో జరిగే జిల్లా రైతులు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు దొబ్బల కృష్ణ, వైరా మండల రైతు సంఘం అధ్యక్షులు కొండా రామకృష్ణలు పిలుపునిచ్చారు. రెబ్బవరం గ్రామంలో బండారుపల్లి ముత్తయ్య అధ్యక్షుడు జరిగిన రైతు సంఘం సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతుల పంటలకు సరిపడా సంపూర్ణంగా యూరియా ఎరువును కేంద్ర ప్రభుత్వం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వల్లంకొండ శ్రీనివాస రావు, తాటికొండలసూర్య,మేడేపల్లి వెంకటేశ్వర్లు, షేక్ ఇమాంబి, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కల్లూరు:** వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం 8వ తేదీ చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ వ్యవసాయ కార్మికులను కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారా 2500 వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్ 4000 ఇవ్వాలని, వికలాంగుల పింఛన్లు 6000 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 8వ తేదీన జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరారు కూలీల సమస్యలు పరిష్కరించి ప్రతి కుటుంబంలో మహిళలకు 50 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి 6000 పెన్షన్ వృద్ధాప్య, వితంతు పించన్‌లను పెంచి ఇవ్వాలని ఇందిరమ్మ ఇల్లు వర్షా కార్మికులకు ఇవ్వాలని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించాలని, అర్హులైన పేదలందరికీ పెంచల మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కల్లూరు లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు సామాన్యులు బతకలేని పరిస్థితిలో ఉందని ధరల మీద ధరలు పెరిగి సామాన్యుడి జీవితం అతలాకుతనం అవుతుందని జిఎస్టి పేరుతో పది సంవత్సరాలు పాటు ప్రజలను దోచుకున్న ప్రభుత్వం నేడు జిఎస్టి తగ్గించమని గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘ నాయకులు దయాకర్ రావు, ఎస్ కె లాల్ మహమ్మద్, వెంకటేష్, రత్నం, షాకీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

# మహనీయుడు తూము ప్రకాశరావు

**-ఆయన ఆశయాలను కొనసాగిస్తాం**
**-విజయవంతంగా బత్తినేని వైద్యక్యాంపులు**
**-60వ క్యాంపులో ట్రస్ట్ ఛైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు, ప్రముఖ ఎన్ఆర్ఐ బత్తినేని రాకేష్**











**ప్రజాపక్షం/బోనకల్:** పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రాణాన్ని సైతం త్యాగం చేసిన మహనీయుడు తూము ప్రకాశరావు అని బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు, ప్రముఖ ఎన్ఆర్ఐ బత్తినేని రాకేష్‌లు కొనియాడారు. మండల కేంద్రం లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతి నెల మొదటి ఆదివారం అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 60 బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపు ఆదివారం విజయవంతంగా ముగిసింది. ముందుగా ఐదేళ్లు(60వ క్యాంపు) పురస్కరించుకొని అఖిల పక్ష నాయకులతో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ 60వ క్యాంపుకు ముఖ్య అతిథులుగా హాజరైన బత్తినేని నాగప్రసాదరావు, బత్తినేని రాకేష్‌లు మాట్లాడుతూ పేదలకు, దళితులకు భూములు దక్కాలన్న ఉద్దేశ్యంతో రాయన్నపేట, కలకోట గ్రామాల్లో భూమి, ఇళ్లు, ఇళ్ల స్థలాలు పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టు అయిన ప్రకాశరావుకే దక్కిందన్నారు. ప్రజల కోసం పాటుపడే వారిని ప్రజలు ఎన్నటి మరిచిపోరని అందుకు ప్రకాశరావు జీవితమే నిదర్శమని అన్నారు. తూము ప్రకాశరావు ఈ ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం పోరాడి తన సర్వస్వాన్ని త్యాగం చేశారని, అందుకే ఇప్పటికీ ఆయన పేరు మీదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. క్యాంపులకు ఆర్థిక సహకారం అందిస్తున్నది తామేనప్పటికీ, నిర్విరామంగా క్యాంపును నడిపించే క్యాంపు నిర్వాహణ కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. అఖిల పక్ష నాయకులు క్యాంపును ఉద్దేశించి మాట్లాడుతూ మండల ప్రజలు సుదూర ప్రాంతాలకు బిపి, షుగర్, కంటి సంబంధిత ఇబ్బందులకు వెళ్లకుండా ప్రతినెల నిపుణులైన వైద్యులతో వైద్యసేవలందిస్తున్న బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్‌ను అభినందించారు. సొంత ఊరికి సదృద్దేశ్యంతో విద్య, వైద్య, మౌళిక వసతులు కల్పిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బత్తినేని నాగప్రసాదరావుకు, వారి కుమారులు ప్రముఖ ఎన్ఆర్ఐలు బత్తినేని ప్రకాశ్, బత్తినేని రాకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ క్యాంపులో వైద్యులు టి పవన్‌కుమార్ 100 పేషంట్లకు వైద్యసేవలందించగా, ఆర్ఎంపిడబ్ల్యూఏటిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, క్యాంపు సహయకులు ఆకెన పవన్, యంగల గిరిలు క్యాంపును నిర్వహించారు. అనంతరం పేషంట్లకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన బత్తినేని నాగప్రసాదరావు, బత్తినేని రాకేష్, తూము రోషన్‌కుమార్‌ల చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. క్యాంపు ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు, క్యాంపు వైద్యులు, క్యాంపు నిర్వహణ కమిటీ సభ్యులు బత్తినేని నాగప్రసాదరావు, బత్తినేని రాకేష్‌లకు పూలమాలలు వేసి, శాలువాలను కప్పి ఘన సన్మానం చేశారు. వీరితో పాటు ప్రముఖ బిపి,షుగర్, జనరల్ వైద్యులు టి పవన్‌కుమార్, క్యాంపు నిర్వాహకులు బొమ్మినేని కొండలరావు, ఆకెన పవన్, యంగల గిరిలను శాలువాలతో చిరుసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, మధిర ఆత్మకమిటీ ఛైర్మన్ కర్నాటి రాంకోటేశ్వరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, బిఆర్ఎస్ మండలాధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జున్‌రావు, కాంగ్రెస్ మండల నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, టిడిపి మండల నాయకులు నందమూరి సత్యనారాయణ, ఆయా పార్టీల నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, పారా ప్రసాద్, మైనేని రవికుమార్, మాజీ మండల కో అప్షన్ సభ్యులు షేక్ హోస్సన్, సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచంద్రరావు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, షేక్ నజీరు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

**-బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అందుకే లేనిపోని విమర్శలు చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం కూలిపోతే మల్లన్న సాగర్‌లో నీళ్లు ఎక్కడివని, హైదరాబాద్‌కు తాగునీరు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసిఆర్ ఉద్యమ నాయకునిగా తెలంగాణ సాధించిన వ్యక్తిగా ఒక యజ్ఞంలా కృష్ణా, గోదావరి నీళ్లను తెలంగాణ పంట పొలాలకు మళ్లించేందుకు కృషి చేశారన్నారు. అందులో భాగంగా పుట్టిందే కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. ఆనాడు తలాపున గోదావరి నది పారుతున్నప్పటికీ తాగడానికి కూడా నీళ్లు లేని దుస్థితి ఉందన్నారు. ప్రాణహిత గోదావరిని ఒడిసిపట్టి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించడం జరిగిందన్నారు. మేడిగడ్డ దగ్గర రెండు ఫిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరమే కుంగిందని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మిస్తే కేసిఆర్ గొలుసుకట్టు రిజర్వాయర్‌ను నిర్మించారన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న మంత్రులు విమర్శలు చేస్తున్నారన్నారు. కేసిఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం సీతారామ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ మూడేళ్లలోనైనా జిల్లాలోని మంత్రులు సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ఖమ్మంజిల్లా ప్రజలకు నీటిని అందించాలన్నారు. లేనిపోని అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షుల పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, మందడపు శంకర్‌రావు, పగడాల నరేందర్, కొండలరావు, మురళికృష్ణ, మహ్మద్ రఫీ, గోపి, రాజేష్, అశోక్‌సింగ్, షారూక్ అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

## శోభనచలంకు ఘన నివాళి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీలో గల శోభనచలం దశ దిన కర్మకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా శోభనచలం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు కైపు ఖగేందర్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, చేతుల పెద్ద వీర్రాజు, బాల నాగిరెడ్డి, దుగ్గిరెడ్డి బాలనారాయణరెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, కైపు అంకిరెడ్డి, సందీప్, మహిళలు, బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లీకేజ్ మరమ్మత్తులు




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని సత్తేరు కుంట లో గత రెండు రోజుల క్రితం ఏర్పడిన మిషన్ భగీరథ పైప్ లీకేజ్ మరమ్మత్తులు నేడు పూర్తి చేసినట్లు మిషన్ భగీరథ ఏఈ శివాని తెలిపారు. మూడు మండలాలకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డి ఈ హరి శివాని లతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. వెంటనే పూర్తి చేయడం పట్ల మూడు మండలాల ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

## పొగాకు అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడులు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులు ఆదివారం వేగవరంలో తనిఖీలు చేసి అక్రమంగా తరలిస్తున్న 12 ఎఫ్‌సివి పొగాకు బేళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో విజిఎల్స్ అధికారి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## ముగ్గురిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/చింతకాని :** మండల పరిధిలోని నరసింహాపురం గ్రామానికి చెందిన నాటురాయి వెంకట్రావ్ అతని భార్య అనూషలపై పాత కక్షలు దృష్టిలో ఉంచుకుని అదే గ్రామానికి చెందిన నాటురాయి అజయ్, జల్ది వినోద్, జల్ది నానీలు శనివారం రాత్రి చేతితో కొట్టి గాయపర్చారు.అజయ్ చేతికి ఉన్న కడియంతో వెంకట్రావ్ పై దాడి చేయగా చెవి భాగంలో గాయమైంది. ఈ విషయమై వెంకట్రావ్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు, ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం, వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మాణమవుతున్న పామాయిల్ ఫ్యాక్టరి పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ ఆదివారం పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ కాంట్రాక్టర్, ఇంజనిర్, సంబంధిత అధికారులతో నిర్మాణానికి సంబందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్లూరుగూడెం చుట్టూ ప్రక్కల గ్రామాల వారికీ రోజు వారి పని కల్పించాలని కాంట్రాక్టర్ కి సూచించారు. ఈ కార్యక్రమం లో వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇమ్మనేని ప్రసాద్ రావు, వెంకటేశ్వరరావు, వేంసూరు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## కలుపు మందు తాగి వృద్ధుడు మృతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని సిద్ధారం గ్రామానికి చెందిన మోరంపూడి మాధవరావు (68) గ్రామంలో చిన్న బడ్డీ కొట్టు నడుపుకుంటూ అతను అతని భార్య సరోజిని జీవిస్తున్నారు. మాధవరావు కి గత నెలలో ఆరోగ్యం సరిగా లేకపోవడంతో హైదరాబాద్‌లో ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్యం చేపించారు. ఈ క్రమంలో మాధవరావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఆరు గంటల సమయంలో తన ఇంటి వద్ద కలుపు మందు తాగి వాంతులు చేసుకుంటుండగా గమనించిన భార్య సరోజినీ చుట్టుపక్కల వారిని తెలిసి అతన్ని సత్తుపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించి చికిత్స చేయించుచుండగా, ఆదివారం మాధవ రావు మృతిచెందాడు. మాధవ రావు కూతురు గాదే సత్యవాణి ఫిర్యాదు మేరకు ఏస్ఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రగ్రహణంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కరకగూడెం:** చంద్రగ్రహణం ఏర్పడుతున్న నేపథ్యంలో అపోహాలు, వాస్తవాలు, శాస్త్రీయ అవగాహనపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తిరుమల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కల్చరల్ సెక్రటరీ డాక్టర్ లింగంపల్లి దయానంద్ ప్రసంగించారు. సదస్సులో వారు మాట్లాడుతూ ఖగోళంలో జరిగే విషయాలు ఎప్పటికీ తెలుసుకోవాలని ఉత్సుకత తో మనిషిని ఎప్పుడూ కలవర పెడుతూనే ఉంటుంది అన్నారు. అందులో భాగంగానే సంపూర్ణ చంద్ర సూర్యగ్రహణాలు ఏర్పడతాయనే సందర్భంలో అనేక ప్రాంతాలలో వివిధ రూపాలలో మూఢనమ్మకాలు, ప్రజలలో విస్తృతంగా ఏర్పడుతున్నాయి అన్నారు. అక్రమంలోని కీడు, శకునం అనే పేరుతో ప్రజలు తమ ఆదాయాలని ఈ వదంతులకు ఖర్చు పెడుతూ నిజా నిజాలు తెలుసుకోకుండా శాస్త్రీయ అవగాహన లేకుండా మరి మారుమూల ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. సంపూర్ణ చంద్రగ్రహాన్ని ప్రజలందరూ ఖగోళ అద్భుతాలను వీక్షించవచ్చుని ఏ రకమైన ప్రమాదాలు లేవని తగిన శాస్త్రీయ అంశాలను జోడిస్తూ విద్యార్థులని చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి రామ్ చందర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మాదాసు అఖిల్, సిఐటియు నాయకులు కొమరం కాంతారావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు చర్ప సత్యం పాల్గొన్నారు.

# పీటర్, ప్రమీల దంపతులు క్రైస్తవ కుటుంబాలకు ఆదర్శం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు, ప్రజల మధ్య సోదరభావాన్ని నింపేందుకు ఏసుక్రీస్తు బోధనలు ప్రచారం చేస్తూ తమవంతు కృషిని కొనసాగించిన దివంగతులు కోరి జాన్ పీటర్ జయప్రమీలాలు క్రైస్తవ కుటుంబాలకు ఆర్శమని, నేటి తరం వాటి అడు గు జాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. రామవరం ఏరియా వన్నందాస్ గడ్డకు చెందిన చర్చీ కమిటీ మాజీ నాయకుడు జానీ పీటర్ సతీమణి చర్చీ స్త్రీలమైత్రి సంఘనాయకురాలు జయప్రమీల ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సందర్శించిన ఆయన పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగన అంతిమయాత్రలో కాఫిన్ మోసి వారికుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టులను పీటర్ కుటుంబం ఆదరించే వారని, ప్రజా ఉద్యమాలను ప్రోత్సహించేవారన్నారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఐ నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, గుత్తుల శ్రీనివాస్, ఎస్‌వి రామారావు, తొగరు నరేంద్ర కుమార్, ఆది మల్లయ్య, కడారి మల్లేష్ తదితరులున్నారు.

# చంద్ర గ్రహణంతో జిల్లాలోని ఆలయాలు మూసివేత





**ప్రజాపక్షం/భద్రాచలం :** సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా జిల్లాలోని వివిధ దేవాలయాలను మూసివేశారు. ఈ చంద్రగ్రహణం అరుదైందిగా ఖగోళశాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రహణాన్ని పురస్కరించుకుని భద్రాచలం రామాలయంతో పాటు పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయం, కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్, అన్నపురెడ్డిపల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు జిలాల్లోని అన్ని అలయాలను అర్చకులు పూజల అనంతరం మూసివేశారు. ఆదివారం రాత్రి 8.58 గం.లకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం (బ్లడ్‌మూన్ 11 గం. నుండి 12.22 గం. వరకు సంపూర్ణ గ్రహంగా రూపాంతరం చెందుతుంది. అదే విధంగా రాత్రి 2.25 గం.లకు వీడిపోతుంది. అర్ధరాత్రి తర్వాత వీడుతుండటంతో సోమవారం ఉదయం అలయాలను తెరిచి సంప్రోక్షణ చేసి యధావిధిగా పూజాధికార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రహణం సమయంలో చంద్రుడు గాఢ ఎరుపురంగులోనికి మారి కనువిందు చేయనున్నాడు. సూర్యునికి, చంద్రునికి సరిగ్గా మధ్యలోనికి భూమి రావడంతో చంద్రునిపై పడే సూర్యకిరణాలు భూ వాతావరణంలోనే పరిక్షేపణం చెందడం,భూమి అంచుల నుండి ఎరుపురంగు కాంతి చంద్రునిపై ప్రసరించడంతో ఎరుపురంగులోకి మారుతాడు.

# గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి




**ప్రజాపక్షం/దమ్మపేటః** మతతత్త్వ రాజకీయలకు వ్యతిరేకంగా, తాను నమ్మిన కమ్యూనిజం సిద్ధంతం కోసం నిలబడ్డ గ్రేట్ లీడర్ సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ అన్నారు. సీతారాం ఏచూరి ప్రధమ వర్ధంతి సభ ఆదివారం యలమంద అధ్యక్షతన నాచారం లోజరిగింది. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి సుఖ ప్రదమైన జీవితం గడపడానికి ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని వదులుకొని ప్రజల కోసం త్యాగాల బాటన నడవాలని ఎర్ర జెండా చేతపట్టారు అని అన్నారు. ఏచూరి తనను ఒక వ్యక్తి గా ఎప్పుడు బావించుకోలేదని, ఒక పెద్ద ఉద్యమం లో తానోక బాగంగా వ్యవహరించడం తన రాజకీయ నిబద్ధత కు నిదర్శనం అని అన్నారు. ఏచూరి పార్టీ లో నిర్వహించిన బాత్యతలకు మించి విస్తారమైన కృషి చేశారు అని, రాజకీయలుకు అతీతంగా అందరు గౌరవించబడ్డ గొప్ప నాయకుల్లో ఏచూరి ఒకరని, ప్రజా సమస్యలు పరిష్కరించే కృషి లో ఏచూరి వారసత్వం కొనసాగించడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మి నారాయణ, పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, ఎండ్రాతి అప్పారావు, పిల్లి నాయుడు, చెన్నకేశవులు, మురహరి రఘు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి లోయలో పడ్డ ఇసుక ట్రాక్టర్

**అక్కడికక్కడే మృతి చెందిన డ్రైవర్**






**ప్రజాపక్షం/గుండాల :** గుండాల మండల కేంద్రానికి సమీపంలో గల కిన్నెరసాని వాగునుండి ఇసుక తోలుతున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు దిగి లోయలో పడి ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఎస్‌కె పాష(64) ఇసుక తీసుకువచ్చేందుకు కిన్నెరసానివాగుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెల్లాడు,వాగునుండి ఇసుక లోడ్‌చేసుకొని వచ్చే క్రమంలో సాయనపల్లిగుండాల మార్గ మద్యలో దేవర చింత చెట్టు వద్ద రోడ్డు పక్కనున్న లోయలోకి దూసుకెల్లింది. ట్రాక్టర్ బ్రేక్ లాక్ ఊడిపోవడంతో గుంతలో పడిపోవడంతో డ్రైవర్ పాష చెట్టుకొమ్మల మద్య పడిపోగ ఇసుక పైనపడి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందుకు తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

**ఇసుక రవాణాపై అధికారుల నియంత్రణ ఏది..?**

కిన్నెర సాని వాగునుండి ఇసుక ఇష్టా రాజ్యంగా, సమయపాలన లేకుండా అధికారుల పర్యవేక్షన లేకుండా తరలిస్తుండటంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంబందిత అధికారులు ఇసుక రవాణపై తగుచర్యలు తీపుకోవాల్సిన అవసరం ఎంతైనాఉంద, ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుడ చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఐటిడిఏ ఇఇగా సత్యానందం



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సిహెచ్ సత్యానందం పదవీ బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నల్గొండ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో డిఇగా పనిచేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పించి ఐటిడిఏ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. డిఇ హరీష్ నుండి సత్యానందం పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

# భూ సమస్యలపై ప్రత్యేక ప్రజావాణి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని వివిధ భూ సమస్యలపై రెవెన్యూ డివిజన్ల వారీగా ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం రెవెన్యూ డివిజన్‌కు చెందిన ప్రజలు కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయంలో జరిగే ప్రత్యేక ప్రజావాణిల్లో తమ భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

**ఐడిఓసిలో...**

పాల్వంచలోని ఐడిఓసి కార్యాలయంలో నేడు ప్రజావాణి నిర్వహించనున్నారు. జిల్లాలోని వివిధ సమస్యలపై దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే వారి లిఖితపూర్వకంగా ఉన్న దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలని, అధికారులంతా సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

# డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు నేషనల్ బిల్డర్ అవార్డ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ నేషనల్ బిల్డర్ అవార్డ్ అందుకొన్నారు. కొత్తగూడెం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం టీచర్స్ డే అవార్డుల ప్రధానోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మకు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వి రామ్ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. విద్యా,బోధనా రంగాలలో చేసిన విశేష కృషికి గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ పద్మ గత 25 సంవత్సరాల అనుభవం కలిగిన గొప్ప విద్యావేత్త అని కొనియాడారు.బిఎస్‌సి డిగ్రీలో కాకతీయ యూనివర్సిటిలో 2వ, ర్యాంకు, తిరుపతిలో గల శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో బంగారు పతకం, మధురై కామరాజ్ యూనివర్సిటీలో ఎంఫిల్, గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటిలో పిహెచ్‌డి పూర్తి చేశారు. అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌లో 22, జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో గణిత శాస్త్రంలో 13 పరిశోధనలు చేశారని,6 వర్క్‌షాపుల్లో పాల్గొని లైన్స్‌క్లబ్ వారిచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును, భద్రాచలంలోని రామానుజం సొసైటీ చే రామానుజం అవార్డు అందుకొన్నారని చెప్పారు. బోధనా వృత్తిలో ఆమె చేసిన సేవలుం పరిశోధనా రంగంలో సాధించిన విజయాల పట్ల ఆమెను అవార్డుకు ఎంపిక చేశామన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు దేవసాని రమేష్, కామేశ్వరరావు, పొట్లపువ్వు శ్రీనివాసరావు, కోటగిరి రాంబాబు, పారెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు అఖిలపక్ష సమావేశం

**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాబోయే ఎం.పి.పి, జెడ్.పి.పి ఎన్నికలు 2025లో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాల ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించుటకై సోమవారం (నేడు) ఉదయం 11:00 గంటలకు మణుగూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై తమ విలువైన సూచనలు అందించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడు ఉచిత నేత్ర శిబిరం

**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని పాత ఎల్‌ఐసి కార్యాలయం ఎదురుగా ఉన్న ఆల్ ఫెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో నేడు ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వరంగల్‌కు చెందిన మ్యాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులచే ఈ వైద్య శిబిరం జరుగుతుందని, శస్త్రచికిత్సలు అవసరం ఉన్న వారిని అదే రోజు వరంగల్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ నిర్వహించిన అనంతరం భద్రాచలంలో దింపుతారని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు తప్పని సరిగా హెల్త్ కార్డు, రేషన్ కార్డు తీసుకురావాలని, విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, జర్నలిస్టులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కారుణ్య నియామకాలకు ముఖాముఖిలు



**ప్రజాపక్షం/ఇల్లెందు:** సింగరేణి పరిధిలో కారుణ్య నియామకాలకై మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు ఏరియా జీ.ఎం.కృష్ణయ్య ఆదేశాల మేరకు డీజీఎం(పర్సనల్) అజ్మీర, జేకేఓసీ పీ.ఓ. శ్రీకృష్ణ మోహన్ ఆదివారం సాక్షుల సమక్షంలో ముఖాముఖిలు నిర్వహించారు. అనంతరం వైద్యపరీక్షలకు పంపిన పిదప నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారులు అజయ్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ ఫ్యాక్టరీని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరచూ ఫ్యాక్టరీ బ్రేక్ డౌన్‌పై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా పదిలక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు అవుతుందని, 31జిల్లాల్లో 20లక్షల ఎకరాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు తెలిపారు. ఒక్కో ఉమ్మడి జిల్లాకు లక్ష ఎకరాలు చొప్పున పది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలి పారు. సిద్దిపేట పామాయిల్ ఫ్యాక్టరీని త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. పామాయిల్ గెలలు టన్ను రూ.25వేలు ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర వ్యవ సాయ శాఖ మంత్రికి స్వయంగా కలిసి వివరించినట్లు తెలిపారు. ఆత్మ గౌరవంతో ఆరోగ్యంగా ఉండేది ఒక్క వ్యవసాయ రంగమేనని పేర్కొ న్నారు. రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఆయిల్ ఫామ్ సాగులో తెలంగాణ దేశానికే హబ్ మారనుందని అన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలు సాగు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని, రైతులు ఆదిశగా అంతర పంటలను వేయాలని సూచించారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు ప్రైవేట్ రంగంలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీలు ఏర్పాటుతో ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలిక మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా, మండల అధికారులు, ఇతర శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 8న జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కమ్యూనిస్టు కార్యక ర్తలు కృషి చేయాలని, అవసరమైతే ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో ఆదివారం జరిగిన సిపిఐ లక్ష్మీదే విపల్లి మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంకోసం స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా పార్టీని మరింత బలో పేతం చేయాలని సూచించారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పోడు భూముల సమస్య, ఫారెస్టు అధికారుల దాడులు తది తర డిమాండ్ల పరిష్కారంకోసం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పార్టీలకతీతంగా జిల్లా నలుమూలల నుంచి వ్యవసాయ కార్మి కులు, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. 9న కొత్తగూడెం క్లబ్బులో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్మరణ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో మండల నాయ కులు దీటి లక్ష్మీ పతి, కె రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, నూనావత్ గోవిందు, కంటెం శ్రీనివాసరావు, శాపావత్ రవి, కల్లెం పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం సీనియర్ నాయకులు, యుటిఎఫ్ నేత జియావుద్దీన్ మృతి





ప్రజాపక్షం/ ఖమ్మం : సిపిఎం సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు, యుటిఎఫ్ రాష్ట్ర నేత జియావుద్దీన్ (76) శనివారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతిచెందారు. సుదీర్ఘ కాలం యుటిఎఫ్ ఉద్యమాలలో పనిచేసిన జియావుద్దీన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోశా ధికారిగా పనిచేశారు. ఖమ్మంజిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులుగా, సిపిఎం నాయకునిగా పనిచేసిన జియావుద్దీన్ నిరంతరం ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వామపక్ష భావజాల వ్యాప్తికి కృషి చేశారు. తిరు మలాయపాలెం మండలం సుబ్లేడులో జన్మించిన జియావుద్దీన్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు జావిద్ నవ తెలంగాణ దినపత్రిక రీజినల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. జియా వుద్దీన్ మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం సిపిఎం కార్యాలయానికి తరలించి అక్కడే సంతాప సభ నిర్వహించారు. పలువురు వామపక్షాల నేతలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు జియావుద్దీన్ సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. జియావుద్దీన్ మృతిపట్ల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి రఘురాంరెడ్డి, సిపిఎం నేత తమ్మినేని వీరభద్రం తదితరులు సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి, సిఐటియు నాయ కులు సాయిబాబు, యుటిఎఫ్ నాయకులు చావా రవి, వెంకట్, దుర్గా భవాని, ఏసిపి ఫణీంద్ర, సోమయ్య, బత్తుల హైమావతి, చింతలచెరువు కోటేశ్వరరావు, నవ తెలంగాణ జనరల్ మేనేజర్ ప్రభాకర్, సుబ్బారావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# వినాయక నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సి పాలిటీలో వైరా ఆర్యవైశ్య వాసవి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహ నిమజ్జనం శోభయా త్రలో పాల్గొన్న శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నా యక్ గణనాథుని దర్శించుకున్న అనంతరం వచ్చే కమిటీ నిర్వాహ కులు ఘనంగా సన్మానించారు. అనంతరం రాందాస్‌నాయక్ మాట్లా డుతూ అంగరంగ వైభోగంగా శోభయాత్ర కార్యక్రమంలో గణనాధుని నిమజ్జన కార్యక్రమంలో పాల్పంచుకోవడం నాకు చాలా ఆనందాన్ని కలిగించిందని పెద్ద ఎత్తున ఆర్యవైశ్య వాసవి యూత్ నాకు ఘనస్వా గతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్పంచుకునే అవకాశాన్ని నాకు కల్పించిన ఆర్యవైశ్య వాసవి యూత్ కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతూ ఎల్లవేళలా గణేష్ ఆశీర్వాదాలు మీకు నిండుగా ఉండాలి. మనస్ఫూర్తిగా కోరుకుంటూ అదేవిధంగా మహిళతో, నవరాత్రులు నిత్యం గణపతి పూజ అందుకున్న లడ్డు ప్రసా దాన్ని కైవసం చేసుకున్న కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన అభినంద నలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్య క్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, బోళ్ళ గంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూత కాని జైపాల్, యూత్ కాంగ్రెస్ నాయకులు పమ్మి అశోక్, శీలం చంద్ర శేఖర్‌రెడ్డి, ఐవి.నాగేశ్వరరావు, మిట్టపల్లి నాగి, కొప్పురావూరి శబరి నాథ్, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, మిట్టపల్లి శ్రీనివాస రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు పెన్షనర్ల సంఘ జిల్లా సమావేశం

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా సమితి సర్వసభ్య సమావేశం ఈనెల తొమ్మిదిన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్నట్లు అధ్యక్ష, కార్య దర్శులు పరిశ పుల్లయ్య , రాయల రవికుమార్ లు తెలిపారు. పెన్షనర్ల సంఘం ముఖ్య కార్యక ర్తల సమావేశం ఆదివారం కృషి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పరిశ పుల్లయ్య, రవికు మార్ లు మాట్లాడుతూ ఖమ్మంజిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశం జిల్లా పరి షత్ మీటింగ్ హాల్‌లో జరుగుతుందని ఈ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాల న్నారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించుకో నున్నట్లు వారు తెలిపారు. పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణిని సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.పెన్షనర్ల సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలని లేని పక్షంలో ఆందోళన బాట తప్పదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్య క్షులు బి. కృష్ణకుమారి, పెద్దమాళ్ల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పి. వీరభద్రరావు, ప్రసాద రావు, బెల్లం రాధాకృష్ణ, కె. శ్రీనివాసరావు, యుగంధర్, ఎం. మల్లికార్జునరావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ రద్దు ఎప్పుడో..?



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ని 5వ వార్డులో ఉన్న సర్వే నెంబర్ 98లో గుట్ట ప్రక్కన ఉన్న 275.5 గజాల భూమిని 407.5 గజాలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న శీలం సాయి ప్రియాంక పేరు మీద ఉన్న ప్రభుత్వం భూమిని రిజిస్ట్రేషన్ రద్దు చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని రిజిస్టర్ తెలిపారు. రెవెన్యూ అధికారులు వైరా సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కి రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించిన వివరాలను అందించిన వెంటనే 98 సర్వే నెంబర్‌లో ఉన్న తప్పుడు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని వారు చెబుతున్నారు. అయితే 98 రిజిస్ట్రేషన్‌కి సంబంధించి సోమవారం నాడు కీలక పరిణామాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ నెంబర్‌లో సుమారు 41 మంది ప్రభుత్వ భూమిని వివిధ తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయాన్ని రెవెన్యూ అధికారులు ధృవీకరించారు. అయితే రిజిస్టర్ ఆఫీస్ కార్యాలయాన్ని ఎన్ని రిజిస్ట్రేషన్‌లకు రద్దుకు సంబంధించి సిఫార్సు చేయనున్నారు అనేది తెలియాల్సి ఉంది. శీలం సాయి ప్రియాంక పేరు మీద ఉన్న రిజిస్ట్రేషన్ రద్దు చేసేందుకు పూర్తిస్థాయిలో సిద్ధమైనట్లు తెలుస్తుంది.

# అశ్వారావుపేట సమితి యూనిట్ ఎన్నిక



ప్రజాపక్షం/ములకలపల్లి: అశ్వారావుపేట సమితి యూనిట్ ఎన్నిక జిల్లా అధ్యక్షులు పులి కంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముల కలపల్లి మండల పరిషత్ కార్యాలయం సమావేశం మంది రంలో ఆదివారం నిర్వ హించారు. సమితి అధ్యక్షు లుగా సయ్యద్ జిలాని, అసోసియేట్ అధ్యక్షులుగా గద్దం నాగేశ్వరావు, కార్యదర్శిగా కాతోజు సైదాచారి, కోశా ధికారిగా ఊకే అలివేలు, ఉపాధ్యక్షులుగా దాసరి దేవేందర్, సహాయ కార్య దర్శిగా జీ గీతాం జలి, కోఆప్షన సభ్యులు 1,2గా ఎస్‌డి బికారి, ఎస్‌కే యాకూబ్ పాషా, గౌరవ అధ్యక్షులుగా నారం వెంకటప్పయ్య,ఉపాధ్యక్షులు(మహిళ)గావర్సా సుజాతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఆరెగూడెం పాఠశాలకు అవార్డుల పంట

## -వివిధ విభాగాలలో ఆరు అవార్డులు పొందిన టీచర్లు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని ఆరె గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు అవా ర్డుల పంట పండింది. ఒకటి.. కాదు రెండు కాదు ఏకంగా ఆరు అవార్డులను అందుకున్నారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని ఆరె గూడెం ప్రభుత్వ పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుంది. ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో వివిధ కేటగిరిలో అవార్డులను సొంతం చేసుకున్నారు. పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 66 మంది ని చేర్పించి, నమోదు లో అత్యధిక మార్కులతో అవార్డు ను సొంతం చేసుకున్నారు. అదే విధంగా పదో తరగతి ఫలితాలలో నూరు శాతం సాధించిన విభాగం, మరియు తెలుగు లో 80 శాతం అత్యధికంగా, మార్కులు సాధించిన విభాగంలో, ఇంగ్లీష్ లో 75 శాతం మార్కులు "సాధించిన విభాగంలో. అదే విధంగా బడి బాగు కోసం విద్యార్థుల కు ప్ర త్యేక ఆటో సౌకర్యం, మరియు ట్యూటర్ ను సొంత ఖర్చులతో ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అవార్డులను సొంతం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఒకే పాఠశాల కు ఆరు అవార్డులను సొంతం చేసుకోవటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ట్రాలీ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా చలమయ్య



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల ట్రాలీ ఆటో యూనియన్ అధ్యక్షుడు గా పసుపులేటి వెంకట చలమయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. మండల ఆటో ట్రాలీ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా వెన్నపూసల సీతారాములు, అధ్యక్షుడు గా పి.వి.చలమయ్య, ఉపాధ్యక్షుడు గా సీహెచ్.గోపి, ప్రధాన కార్యదర్శి గా జాలా సాయి, కార్యదర్శిగా మాలోత్ శివ, కోశాధికారి గా మామిడి ఉపేందర్, ప్రచార కార్యదర్శి గా జాలారి, కార్యవర్గ సభ్యులు గా వెంకన్న. మామిడి లవన్ సైదులు, నాగరాజు, రాము లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ సమావేశంలో ఆటో యూనియన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.